ప్రజాశక్తి

శనివారం 25 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మరో 7 నెలలు..!

◆ విశాఖ పోర్టుకు ఆగస్టులో క్రూయిజ్ షిప్ ◆ ఒకేసారి 2 వేల మంది ప్రయాణించేలా ఏర్పాట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎప్పటి నుంచో సముద్ర పర్యాటకులను ఊరిస్తూ వస్తున్న క్రూయిజ్ నౌక ఈ ఏడాది ఆగస్టులో విశాఖపట్నం పోర్టుకు రానుంది. విశాఖపట్నం పోర్టు యాజమాన్యం కృషి ఫలితంగా ఈ క్రూయిజ్ షిప్ పుదుచ్చేరి, చెన్నయ్, విశాఖపట్నం మధ్య ఆగస్టు 4 నుంచి 22 వరకు మూడు దఫాల సర్వీసులను నడిపేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. మెస్సేర్స్ జిఎసి షిప్పింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఈ సర్వీస్‌కు షిప్పింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తోంది.

క్రూయిజ్ టెర్మినల్ (ఫైల్ ఫొటో)

ఇక విశాఖపట్నం పోర్టు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రూయిజ్ టెర్మినల్‌ను ఇప్పటికే అభివృద్ధి చేసింది. ఇది ఒకేసారి 2 వేల మంది ప్రయాణికులకు అవసరమైన అన్ని సేవలను అందించే విధంగా రూపుదిద్దుకుంది. ఈ టెర్మినల్‌లో ఇమిగ్రేషన్, క్లియరెన్స్ కౌంటర్లు, పార్కింగ్, డ్యూటీ ఫ్రీ షాప్స్, ఫుడ్ కోర్టులు, లాంజ్‌లు ఉన్నాయి. ఇది విశాఖ నగర సమీపంలో ఉన్న పర్యాటక ప్రదేశాలకు అత్యంత చేరువుగా ఉంది. అంతర్జాతీయ పర్యాటకులకు అత్యంత అనువుగా మారనుంది.

ముచ్చటగొలిపే నిర్మాణం

ఈ టెర్మినల్ మొత్తం 3,530 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించబడింది. గ్రౌండ్ ఫ్లోర్ 2750 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయాణికుల రాకపోకల కోసం ఉపయోగించబడుతుంది. మొదటి అంతస్తు 780 చదరపు మీటర్ల విస్తీర్ణంలో చూడ ముచ్చటగా నిర్మితమైంది. 180 మీటర్ల పొడవుగల బెర్త్‌ను కలిగి ఉంది, నాలుగు మూరింగ్ డాల్ఫిన్లతో కలిపి 330 మీటర్ల పొడవు, 37.6 మీటర్ల వెడల్పు, 8.1 మీటర్ల డ్రాఫ్ట్‌గల పెద్ద క్రూయిజ్ షిప్‌లను ఇది హ్యాండిల్ చేయగలదు.

పర్యాటకానికి గమ్యస్థానంగా పోర్టు

విశాఖపట్నం పోర్టులో ఇప్పటికే అంతర్జాతీయంగా ఎంతో ప్రసిద్ధి చెందిన లగ్జరీ క్రూయిజ్ షిప్ 'ద వరల్డ్'ను విజయవంతంగా టెర్మినల్ వద్ద బెర్త్ చేశారు. అంతర్జాతీయ లైనర్లను నిర్వహించగల సామర్థ్యాన్ని ఇది తెలియజేస్తోంది. విశాఖపట్నం ప్రముఖ క్రూయిజ్ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి కాగలదని పలువురు భావిస్తున్నారు.

ప్రాంతీయ శాఖలతో పోర్టు సమన్వయం

ప్రాంతీయ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో విశాఖ పోర్టు జివిఎంసి, విఎంఆర్‌డిఎ అధికారులతో కలిసి పనిచేస్తోంది. శుక్రవారం ఎపిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ అమ్రపాలి మిగతా 2లో..

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

ప్రభుత్వ రంగంతోనే అభివృద్ధి

'ఉక్కు' జెఎసి దీక్షల్లో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని, అందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరముందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి 1415వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు ఆధునిక దేవాలయాలని భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చెప్పారన్నారు. భారతదేశ స్వయం ప్రతిపత్తికి, దేశ ప్రజల ప్రయోజనార్థం భారీ పరిశ్రమలను, వ్యవసాయాన్ని జాతీయం చేయాలని రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారన్నారు. అందుకు భిన్నంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రాణం తీయడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు సాగిస్తోందన్నారు. ప్రభుత్వరంగ మిగతా 2లో..

'ఉక్కు' ప్రయివేటీకరణ ఉండదని ప్రకటించాలి

▶ వార్త మెయిన్‌లో..

ఇగ్నోలో బిఇడి, బిఎస్‌సి నర్సింగ్ అడ్మిషన్లు

▶ వార్త 2లో..

హనీ ట్రాప్ కేసులో ఐదుగురు అరెస్టు

▶ వార్త 3లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో..

110 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. ఈ విషయాలను స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి మీడియాకు వెల్లడించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో 110 అంశాలతో పాటు ఒక టేబుల్ అజెండా అంశం కలిపి మొత్తం 111 అంశాలు పొందుపరిచామని, వాటిపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప మినిస్టీరియల్ సిబ్బందికి సంబంధించిన 44వ అంశాన్ని వాయిదా వేశామని తెలిపారు. మిగిలిన 110 అంశాలూ ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలు ఆమోదం పొందిన వాటిలో ఉన్నాయని అన్నారు. సమావేశంలో 2, 3, 8 జోనల్ కమిషనర్లు ఎమ్‌విడి.ఫణిరామ్, కె.శివప్రసాద్, హేమావతి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆది నారాయణరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజ్, పివి.గంగాధరరావు, అప్పారావు, దిలీప్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం

డిఐఇపిసి సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. అన్ని రకాల సాంకేతిక అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గాజువాక - ఆటోనగర్ వద్దగల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఒబి), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పిఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణాలకు, మిగతా 2లో..

27న ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రీజినల్ టూరిజం ఇన్వెస్టర్స్ ఎంగేజ్మెంట్ పేరుతో ఈ నెల 27న విశాఖపట్నం వేదికగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు జరుగనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారిణి కె.జ్ఞానవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నోవొటెల్ హోటల్‌లో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందని, జాతీయ స్థాయిలోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించే నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024-29 న్యూ టూరిజం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మరో 7 నెలలు..!

అధ్యక్షతన పోర్టులో సమావేశం జరగ్గా ఆమె టూరిజం ఆపరేటర్లకు, ఇతర పిఎస్‌యులకు విశాఖపట్నం అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాల గురించి వివరించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ పర్యాటకాన్ని, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టయిందని విపిఎ కార్యదర్శి వేణుగోపాల్ వెల్లడించారు.

ప్రభుత్వ రంగంతోనే అభివృద్ధి

సంస్థల ద్వారానే సామాజిక న్యాయం అమలవుతోందన్నారు. 2021 జనవరి 27న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూటికి నూరు పాళ్లు అమ్మేయాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించిందని,. అప్పటి నుండి తెలుగు ప్రజలందరి సహకారంతో నేటి వరకూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో టిడిపి, జనసేన కూటమి పార్టీలు ఉక్కు కర్మాగారాన్ని రక్షిస్తామని నమ్మబలికి, గెలిచాక మాట నిలబెట్టుకోలేదన్నారు. కేంద్రం ఇచ్చిన అరకొర ప్యాకేజీ ప్లాంట్‌ను రక్షించలేదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడంతో ఉత్పత్తికి అధిక వ్యయం అవుతోందన్నారు. ప్లాంట్ నష్టాలకు ఇదీ ఒక కారణమన్నారు. లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. ప్లాంట్ సజావుగా నడిచేందుకు వర్కింగ్ కేపిటల్, సొంత గనులు కేటాయించాలని కోరారు. ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు ప్రధాని ప్రకటించాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షల్లో జెఎసి వైస్ చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు పైడితల్లి, జిల్లా కమిటీ సభ్యులు సామాదుల గణేష్, గొలగాని అప్పారావు, సరోజనమ్మ, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.

ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రభుత్వాల సన్నాహాలు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల సన్నాహాలు చేస్తున్నాయని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వివి.రమణమూర్తి అన్నారు. ఈ కుట్రలను ఎదుర్కునేందుకు అందరూ ఐక్యం కావాల్సి ఉందన్నారు. ఉక్కు రక్షణ కోసం శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పలు సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్, మురికివాడల నివాసితుల సంఘం మాజీ అధ్యక్షులు ఎం.రవి, భారత నాస్తిక సమాజం అధ్యక్షులు రాంప్రభు, భారత్ బచావో అధ్యక్షుడు ఎస్ఆర్.వేమన పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదు

ప్రజాశక్తి - ఉక్కునగరం : ప్రస్తుత పరిస్థితుల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదని, ప్లాంట్‌ను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని ఎపిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1443వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌పై శ్రద్ధ పెట్టి ఎటువంటి భేషజాలకూ పోకుండా నిధులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడపాలన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలూ ఒకే వేదికపై రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జివి.నారాయణరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నాయకులు దాసరి సురేష్ బాబు, ఆర్.రాజుబాబు, దాసరి శ్రీనివాస్, చిత్రాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం

పరిశ్రమల నిర్వహణకు అవసరమైన నీటి వనరులను సమకూర్చాలని, సొసైటీ భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ సేకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ అంశాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఇ సెక్టార్ల ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించాలన్నారు. కోర్టు కేసులు, ఆక్రమణల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిశ్రమల శాఖ జిఎం వి.ఆదిశేషు మాట్లాడుతూ సమావేశం అజెండా అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు. విశాఖపట్నం ఆర్‌డిఒ పి.శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

27న ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

పాలసీపై దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, అధికార ప్రతినిధులు చర్చిస్తారని తెలిపారు. సదస్సులో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఛైర్మన్, సిఎస్, ఎమ్‌డి, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు భాగస్వామ్యమవుతారని తెలిపారు.

ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని నేర్చుకోవాలని భారత మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. శుక్రవారం నుండి విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ వేదికగా నిర్వహిస్తున్న ఎబివిపి 43వ రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కష్టపడటం అలవాటు కావాలన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు పివిఎన్.మాధవ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్ల రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గీత కులాలకు జిల్లాలో 14 దుకాణాలు కేటాయిస్తూ జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో ఎక్సైజ్ డిసి రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, గీత కులాల ప్రతినిధులు, మీడియా సమక్షంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. మొత్తం 14 దుకాణాలకుగాను జివిఎంసి పరిధిలో 11, గ్రామీణ మండలాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధిలో మరొక మూడు దుకాణాలు ఉన్నాయి. లాటరీలో భాగంగా జివిఎంసి పరిధిలోని 11 దుకాణాల్లో ఒకటి గౌడ, మరొకటి యాత కులానికిరాగా, మిగిలిన తొమ్మిది దుకాణాలు శెట్టిబలిజ కులానికి దక్కాయి. మిగిలిన మూడింటిలో గౌడ కులానికి ఆనందపురంలో అవకాశం లభించగా, భీమిలి, పద్మనాభం మండలాల్లో శెట్టిబలిజకు రెండు దుకాణాలు దక్కాయి. ఈ ప్రక్రియలో మొత్తం జివిఎంసి, గ్రామీణ మండలాలైన భీమిలి, పద్మనాభంలో శెట్టిబలిజకు మొత్తం 11 దుకాణాలు రాగా గౌడకు ఆనందపురంలో, యాత, గౌడ కులాలకు జివిఎంసిలో ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు దక్కాయి. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్థానికంగా నిర్వహించిన లాటరీ ప్రక్రియ ప్రాథమిక వివరాలను డైరక్టరేట్‌కు నివేదిస్తామని, దాని ప్రకారం గెజిట్ విడుదల అవుతుందని అన్నారు. ఈ నెల 27న గెజిట్ విడుదల అయిన నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరి 6న పరిశీలన ప్రక్రియ, 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి తుది లాటరీ ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం దుకాణాల కేటాయింపు ప్రక్రియను నిబంధనలను అనుసరించి అత్యంత పారదర్శకంగా నిర్వహించామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

ఇగ్నోలో బిఇడి, బిఎస్‌సి నర్సింగ్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జనవరి - 2025 విద్యా సంవత్సరానికిగానూ బిఇడి, బిఎస్‌సి నర్సింగ్ కోర్సులకు అడ్మిషన్ల కోసం ప్రకటన జారీ చేసినట్టు ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం తెలిపారు. ఈ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రవేశ పరీక్ష ఆధారంగా మెరిట్ పద్ధతిన జరుగుతాయి. ప్రవేశ పరీక్షలు దేశంలోని అన్ని ప్రాంతీయ కేంద్రాల పరిధిలో.. ఎంపిక చేయబడిన పరీక్షా కేంద్రాలలో ఉంటాయి. ప్రవేశ పరీక్షలను మార్చి 16న నిర్వహిస్తామని, ఈ ప్రవేశ పరీక్షలు రాయాలనుకునే వారు తమ ఆన్‌లైన్ లింకుల ద్వారా ఫిబ్రవరి 21లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిఇడి ప్రవేశ పరీక్ష దరఖాస్తు లింకు: https://ignou-bed.samarth. edu. in/index.php, బిఎస్‌సి నర్సింగ్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు లింకు https:// ignounursing.samarth.edu.in/index.php గా ప్రకటించామన్నారు. మరింత సమాచారం కోసం ఎంవిపి.కాలనీలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలని, 0891-2511200 నెంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

ఫుడ్ కోర్టులో ఆకస్మిక తనిఖీలు

ఫుడ్ కోర్టులో తనిఖీలు చేపట్టిన ప్రణవ్ గోపాల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురం సమీపంలో ఉన్న వియంఆర్‌డిఎకు చెందిన బాలల థియేటర్‌లో ఉన్న ఫుడ్ కోర్టులో వియంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ కె.రమేష్‌లు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఫుడ్ కోర్టు నిర్వహణపై నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఫుడ్ కోర్టులో ఎలాంటి తినుబండారాలూ లేకపోగా ఒక ప్రైవేటు కార్యాలయం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ కోర్టులో ఆహార పదార్థాలు, ఇతర తినుబండారాలు లేకపోవటం, కార్యాలయ నిర్వహణను చూసి ఆశ్చర్యపోయారు. బాలల థియేటర్‌కు వచ్చిన వారికి అవసరమైన ఆహార పదార్థాలు, ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని హెచ్చరించారు. ప్రైవేట్ కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఫుడ్ కోర్టు నిర్వాహకుడు కిరణ్ కుమార్‌కు నోటీసులు జారీ చేశారు.

26న మాంసం దుకాణాలకు సెలవు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 26 ఆదివారం భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జివిఎంసిలోని మాంసం దుకాణాలకు సెలవు ప్రకటించామని, హోటళ్లు, రెస్టారెంట్లలో ఎటువంటి మాంసాహారాలను వినియోగించరాదని జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బాలికలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిపార్టుమెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో పెద్ద వాల్తేరులో ఉన్న కెడిపిఎం హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడేవారికి ఐరన్ సిరప్‌లు, అల్బెండజోల్ టాబ్లెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెడిపిఎం స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుమతి బాయి, గీతం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంవివి.మురళీ మోహన్ పాల్గొన్నారు.

సుమతి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి పరిపాలన విభాగానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైన సుమతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. అనంతరం ఆమెను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 332/2023

బిట్వీన్ :
పుల్లా అప్పలనర్సమ్మ .... వాది
అండ్ :
చల్లా శ్రవణ్ కుమార్ ... ప్రతివాది

ప్రతివాది :
చల్లా శ్రవణ్ కుమార్
S/o నాగభూషణం, డోర్ నెంబర్. 9-1-64, రామాలయం దగ్గిర, కోట్నివీధి, అనకాపల్లి .

పై నంబర్ గల దావాలో వాది ప్రతివాది పై ప్రామిసరీ నోట్ బాకీ మొత్తం రాబట్టు నిమిత్తం దావా దాఖలు చేసినందున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తేదీ 06-02-2025** వాయిదా వేసివున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10:30 నిముషాలుకు** హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షంగా పై దావాలో తీర్మానించుదురు.

By order of the honourable court

వి. వెంకటరావు
అడ్వకేట్,
అనకాపల్లి

అనకాపల్లి
తేది. 25-01-2025

పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లైంట్ అయినటువంటి శ్రీ గుటూరు వెంకట చంద్రశేఖర్ సన్నాఫ్ లేట్ గణపతిరావు రిసైడింగ్ ఇట్ ఫ్లాట్ నెంబర్ 401 ఈ.ఎస్.ఎస్.ఈ.ఎం. హోమ్స్, చినముషిడివాడ పెందుర్తి విశాఖపట్నం సెల్ నెంబర్ 8008267747 గారు క్రింది షెడ్యూల్లో ఉదహరించిన తన స్వార్జిత ఆస్తి యొక్క వ్యవహారములలో స్వీయ పర్యవేక్షణకు అవకాశం లేకుండుట వలన తన శ్రేయోభిలాషులు అయినటువంటి :

1.Sri. Latchireddy shivaji, S/o late Apparao, age 49, r/at D.no.1-17/3/, Sai Brahmaji Residency, Jodugullapalem, VSP, VSP District -530040.
2.Sri. Gorla Appalanaidu, S/o Jogi naidu, age 40yrs, D.no.38-21/1, Sri Sairama Nilayam, Marripalem, 104 area, VSP -530018.
3.Smt. Guturu Mrudula, W/o Venkata Chandra sekhar, R/at Flat no 401, Essem Homes, Navya Vikas School, Pendurthi, VSP 530051.
4.Sri. Janapareddy Lokesh, S/o late Srinu, R/at D.no 2-20, Munagapaka Mandalam, anakapalli.

గార్లకు సదరు షెడ్యూల్ ఆస్తికి సంబంధించి యావత్తు వ్యవహారములు చూచుటకు వారి పేర రిజిస్టర్డ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ i.e GPA Document No: 5208/2024, Dt. 4-4-2024 ద్వారా తమ తరుపున ఏజెంట్సుగా నియమించుకోవడం జరిగినది.తదుపరి నా క్లైంట్ పై పేర్కొన్న రిజిస్టర్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీకి అనుబంధంగా పైనుదహరించిన ఏజెంట్లలో ఒకటి మరియు రెండవ పార్టీలు అయినటువంటి శ్రీ లచ్చిరెడ్డి శివాజీ గారు మరియు శ్రీ గొర్లె అప్పలనాయుడు గార్లతో ఒక అన్ రిజిస్టర్డ్ అంగీకార పత్రమును తే.20-04-2024 దీన G.P.A షరతులకు లోబడి వ్రానుకోవడం జరిగింది. పై వ్యవహారములకు సంబంధించి యావత్తు ఖర్చులను అనగా జిపిఏ రిజిస్ట్రేషన్ సంబంధిత అన్ని ఖర్చులను నా క్లైంటు తన సొంత పైకంతో భరించడం జరిగింది. తదుపరి సదరు జిపిఏ నందు పేర్కొన్న షరతులను ఉల్లంఘించి మరియు నా క్లైంట్ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించుట వలన సదరు పై పేర్కొన్న ఏజెంట్స్ కు వ్యక్తిగతంగా తేదీ.10-12-2024న వారికి ఇచ్చినటువంటి రిజిస్టర్డ్ GPA ను రద్దు చేస్తూ రిజిస్టర్ లాయర్స్ నోటీస్ ద్వారా వారికి తెలియజేయుట జరిగినది. కావున లోకులెల్లరుకు తెలియజేయునది ఏమనగా సదరు రద్దు కాబడిన రిజిస్టర్ జిపిఏ ద్వారా ఇకమీదట షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎటువంటి ఆర్థిక వ్యవహారములను ఎవ్వరైనను సదరు ఏజెంట్స్‌తో చేసిన యెడల అవి నా క్లైంట్ ను బంధించజాలవని అటువంటివారు నష్టపోవుదురనియు మరియు తదుపరి మేము వారిపై తీసుకునే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురని ఇందుమూలంగా తెలియజేస్తున్నాను.

షెడ్యూలు : విశాఖపట్నం జిల్లా, గాజువాక సబ్ రిజిస్టర్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్, గాజువాక మండలం, కణితి గ్రామం తాలూకా, జిరాయితి పట్టా దాఖల సర్వేనెంబర్ 306/1a2b రులో జేరినట్టి బాలాజీ నగర్ లేఔట్ లోగల ప్లాట్ నెంబరు 189 రూ లో గల 417 స్క్వేర్ యార్డ్స్ లేక 348.66 స్క్వేర్ మీటర్స్ విస్తీర్ణం గల ఖాళీ **స్థలమునకు హద్దులు : East :** Plot No 190, **South:** 30 Feet Road, **West :** Plot No 188, **North :** Plot No 201.

ఇట్లు
**సనపల నరసింహస్వామి, అడ్వకేట్,
డోర్.నెం.39-25-16, సీతన్న గార్డెన్స్,
మాధవధార, విశాఖపట్నం-530007,
సెల్ నెం. 8121360024**

బాలికల ప్రత్యేక వసతి గృహంలో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలిలోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక వసతి గృహం విద్యార్థినుల వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం వసతిగృహాన్ని సందర్శించారు. సంబంధిత అధికారులు, బాలికలతో చర్చించారు. మూడురోజులుగా సాగుతున్న బాలికల సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టి, వ్యవహారాన్ని సుఖాంతం చేశారు. ఈ సందర్భంగా కమిషన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

బాలికల ప్రత్యేక వసతిగృహంలో వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న ఏలూరుకు చెందిన ఇద్దరు బాలికలను, ఎన్‌టిఆర్, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన చెరో బాలికల కేసులకు సంబంధించి ఆయా జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీలతో మాట్లాడారు. సంబంధిత జిల్లాల కమిటీల సమక్షంలో బాలికలను వారికుటుంబ సభ్యుల చెంతకు చేర్పించారు. అలాగే అనంతపురం జిల్లాకు చెందిన బాలిక కేసు రాష్ట్ర హైకోర్టులో పరిధిలో ఉందని వెల్లడించారు. వివాదాన్ని చక్కదిద్దేందుకు కమిషన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందించిన విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీలతోపాటు శ్రీకాకుళం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల చైర్మన్లు, సభ్యులు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

జీవామృత కుండీల తయారీపై రైతులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- ఆనందపురం: జీవామృతం తయారీకి కుండీలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ప్రాంతీయ వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి జీవామృతం కషాయాల తయారీకి శాశ్వత ఫిట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.
ప్రాంతీయ వ్యవసాయాధికారి హేమసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు ద్వారా తక్కువ పెట్టుబడులతో ఆరోగ్యకరమైన అధిక పంట దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు ఈ విధానంలో సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ చక్రవర్తి, మౌనిక, రూప, మోడల్ మేకర్ రామారావు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, ఐ.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్,
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

హనీ ట్రాప్ కేసులో ఐదుగురు అరెస్ట్

మరో ఇద్దరు నిందితుల పరారీ : చాకచక్యంగా కేసు ఛేదించిన క్రైం పోలీసులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : హనీట్రాప్ తరహాలో మహిళతో ఫోను చేయించి, ప్రైవేటు ప్రదేశానికి రప్పించి దోపిడీకి పాల్పడిన కేసులో నిందితులను భీమిలి పోలీస్‌స్టేషన్ నేరవిభాగం పోలీసులు గుర్తించారు. మండలంలోని దాకమర్రి వద్ద పక్కా ప్రణాళికతో దోపిడి చేసి, నగదు, ఎటిఎం కార్డులను ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపింది. నేర విభాగం ఎస్ఐ సూర్య ప్రకాశరావు తెలిపిన వివరాలివి.

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రాంతానికి చెందిన ఎం. రామారావు కుమార్తె ఆనందపురం మండలం పెద్దిపాలెంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. పండగ సెలవులు తర్వాత ఈనెల 19న పాఠశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో తన కుమార్తెను దింపిన తర్వాత తిరుగు ప్రయాణంలో సొంతూరు వెళ్లేందుకు రామారావు బస్సు కోసం నిరీక్షిస్తుండగా, విశాఖ కంచరపాలేనికి చెందిన కుప్పిలి ఆశారాణి ఫోన్ చేసింది. సంగివలస మూడుఅమ్మ వార్ల గుడి వద్ద కలుద్దామన్న ఆమె పిలుపుతో అక్కడికి వెళ్లిన రామారావును మూడు బైక్‌లపై వచ్చిన నిందితులు, విజయనగరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ బంగారి చక్రవర్తి, అదే జిల్లా బొండపల్లికి చెందిన దోల లక్ష్మణరావు, విశాఖ నగరంలోని ఎంవిపి, ఉషోదయ జంక్షన్‌కు చెందిన మునపర్తి వెంకటేష్, విజయనగరం గూడ వీధికి చెందిన ఇంటి సురేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మొత్తంగా ఆరుగురు వచ్చి, ఆశారాణికి ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నావని బెదిరించి స్కూటీపై భీమిలి మండలం దాకమర్రిలో నిర్మానుష్య మైన ఓ ప్రైవేట్ లేఅవుట్ లోకి తీసుకెళ్లి, బాధితుడు రామారావు నుంచి రూ 50 వేలు నగదు, ఎటిఎం, ఫోన్, పాన్‌కార్డ్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తాజాగా రామారావు బ్యాంక్ ఖాతా నుంచి రూ 8,900 డ్రా చేశారు.

కుటుంబ సభ్యుల సాయంతో బాధితుడు రామారావు ఈ నెల 22.న భీమిలి నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 18న కూడా నిందితురాలు ఆశారాణి బాధితుడు రామారావుకు ఫోన్ చేసింది. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు ఆశా రాణితోపాటు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇద్దరు నిందితుడు పరారీలో ఉన్నట్లు క్రైం ఎస్ఐ సూర్య ప్రకాశరావు తెలిపారు.

కొంప ముంచిన ఈత సరదా

గంభీరం డ్యాంలో మునిగి బీటెక్ విద్యార్థి దుర్మరణం
మృతుడు గాయత్రి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి

రిజర్వాయర్ నుంచి వెలికితీసిన నాని మృతదేహం

మీసాల నాని (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఆనందపురం: మండలం గంభీరం పంచాయతీలోని రిజర్వాయర్‌లో ఈతకు దిగి కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి.
విజయనగరం జిల్లాగుర్ల మండలం కందివలస గ్రామానికి చెందిన మీసాల నాని (20) కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఆరుగురు స్నేహితులతో కలిసి గంభీరం రిజర్వాయర్ వెళ్లిన క్రమంలో, డ్యాంలో సరదాగా ఈత కొట్టేందుకు నాని రిజర్వాయర్ లో దిగాడు. 20 నిమిషాల పాటు ఈత కొడుతూ అలసిపోయి ఒక్కసారిగా నాని, మునిగిపోవడంతో కాపాడండి అంటూ తోటి స్నేహితులకు పెద్దగా కేకలు వేశారు. సంఘటన స్థలానికి, గ్రామస్తులు, ఒఎన్‌జిసి ఫౌండేషన్ సభ్యులు చేరుకుని,కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే మునిగిపోయాడు. గతంలోనూ చాలాసార్లు గంభీరం రిజర్వాయర్‌కు వచ్చిన నాని, సరదాగా ఈత కొట్టేవాడని తోటి స్నేహితులు చెబుతున్నారు. ఆనందపురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని రిజర్వాయర్ వద్దకు చేరుకుని, నాని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనందపురం సిఐ. సిహెచ్. వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరువ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయొద్దు

- జోనల్ కార్యాలయం వద్ద ధర్నా

ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి- వేపగుంట: చిరువ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను జివిఎంసి అధికారులు, పోలీసులు మానుకోవాలని ఎఐటియుసి నాయకుడు ఆర్.శ్రీనివాస్, ముత్యమాంబ తోపుడుబళ్ల వ్యాపారసంఘ గౌరవాధ్యక్షుడు వై.రాంబాబు అన్నారు. శుక్రవారం వేపగుంటలోని జివిఎంసి ఎనిమిదో జోనల్ కార్యాలయం వద్ద చిరు వ్యాపారస్తుల పట్ల జివిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూచిరు వ్యాపారస్తులకు హకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని 2013లోనే సుప్రీం కోర్టు తీర్పులో స్పష్టం చేయడంతోపాటు 2014లో పార్లమెంట్‌లో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినా ఎటువంటి చర్యలు చేపట్టని యంత్రాంగం, ఇపుడు రోడ్డు పక్కల్లో వ్యాపారాలు చేస్తున్న చిరువ్యాపారులు, తోపుడుబళ్ల దుకాణదారుల జీవనోపాధి హరించే చర్యలు చేపడుతోందని మండిపడ్డారు. చిరువ్యాపారుల పట్ల సానుకూలంగా ఉండాల్సిన అధికారులు, పోలీసులు, వారి ఆస్తులను నష్టపరిచే చర్యలు చేపట్టడం సరికాదన్నారు. అనంతరం జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎన్.ఆసిరినాయుడు, వ్యాపారస్తులు శ్రీను, గౌరి, సత్యనారాయణ, వసంతరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుండి బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ధనుంజయ్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన బ్రాందీ షాప్ యజమాని మద్దాల శివప్రసాద్ (38) గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై చంద్రయ్యపేటలో ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో పెందుర్తి నుండి వస్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి శివప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రసాదును కె.కోటపాడు 50 పడకల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. బొలెరో వాహనంలో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విప్పలపాలెంలో చోరీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని విప్పలపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆ ఇంట్లో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, పది తులాల వెండి వస్తువులు అపహరించారు. కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు అందించిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన భీమిరెడ్డి రాజేశ్వరి గురువారం ఉదయం వ్యవసాయ పనులు నిమిత్తం పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చి బీరువా తాళాలు తీసి పరిశీలించగా రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు పది తులాల వెండి వస్తువులు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. వెల్లంకి గ్రామానికి చెందిన ముక్కుమల్ల రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివి.
వెల్లంకి గ్రామానికి చెందిన ముక్కుమళ్ల రాజశేఖరరెడ్డి ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. వ్యాపారంలో భాగంగా ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేశాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు షాప్‌కు వెళ్తున్నానని తన భార్యకు చెప్పి వెళ్లాడు. అయినా ఎప్పటికీ రాకపోవడంతో భార్య రాజ్యలక్ష్మి అనుమానం వచ్చి షాపుకు వెళ్లి చూడగా భర్త లేదని గుర్తించింది. చుట్టుపక్కల వెతకడంతోపాటు పలుచోట్ల ఆరా తీసినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబీకులు సహాయంతో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ పి.కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి- పెందుర్తి : మద్యం మత్తులో వాహనాలు నడిపినా, నిబంధనలను అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరాజు అన్నారు. శుక్రవారం జివిఎంసి 96వ వార్డు పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరాజు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు అతివేగంగా ఆటోలను నడపరాదని,ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో వాహనదారులు, ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మూడో వార్డులోని జివిఎంసి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును శుక్రవారం పథకం జిల్లా కోఆర్డినేటర్ శాస్త్రి పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా అవగాహన కల్పించాలని హెచ్ఎం తిరుమల శ్రీదేవికి సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

న్యాయ సహాయకుల నియామకానికి
31లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్/ లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం జిల్లాలో పారా లీగల్ వాలంటీర్లుగా (న్యాయ సహాయకులుగా) పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్ ఉత్తర్వుల మేరకు, జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు, తగు న్యాయ సహాయం చేయాలన్న ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. .అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్, విద్యార్హత పత్రాలు,ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో,ఒక స్టాంప్ సైజు ఫోటో, ఇతర సంబంధిత పత్రాలు విశాఖపట్నం జిల్లా కోర్టులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.కనీసం పదవ తరగతి విద్యార్హత, వివిధ సేవా సంస్థలలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఎటువంటి జీతంగానీ,పారితోషికం గానీ ఉండదని తెలిపారు. శిక్షణా తరగతుల అనంతరం (వంద మందిని) పారా లీగల్ వాలంటీర్లుగా ఒక ఏడాది కాలానికి నియమిస్తారని తెలిపారు.విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్స్, అంగన్వాడీలు, డాక్టర్స్, ఫిజీషియన్స్, రాజకీయేతర స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, మైత్రి, స్వయంశక్తి సంఘాల సభ్యులు, సత్ప్రవర్తన కలిగిన విద్యావంతులైన ఖైదీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

దేవన్ రెడ్డిని కలిసిన వైసిపి నేతలు

దేవన్‌రెడ్డిని అభినందిస్తున్న లక్ష్మి

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన రెడ్డిని, శుక్రవారం పలువురు వైసిపి నేతలు కలిశారు. ఎపి హైకోర్టు న్యాయవాది, యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, శుక్రవారం దేవన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, బాబూరావు రెడ్డి, శ్రీను, పిల్లి చిన్న, ఎస్ఎం నాయుడు, వంగల శ్రీను, గండిబోయిన కరుణ, గెద్దాడ శంకర్, కెవి రమణ, అజ్జల శ్రీను రాజు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్కులో ముళ్ల పొదల తొలగింపు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండోవార్డు సంగివలస కొండప్ప చెరువును అనుకుని ఉన్న పార్కు చుట్టూరా ఏపుగా పెరిగిన ముళ్ళ పొదలను శుక్రవారం తొలగించి, శుభ్రపరిచారు. విప్పాడ దివీస్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన ఈ చిల్డ్రన్స్ పార్కులో నిర్వహణ, పర్యవేక్షణ లోపం వల్ల పార్కు పరిసరాల్లో అపరిశుభ్రత చోటు చేసుకుంది. విషయాన్ని గమనించిన దివీస్ సంస్థ స్పందించి జివిఎంసి ఒకటో జోన్ అధికారులతో సంప్రదించి, పార్కులో పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, పి శేఖర్‌బాబు, జివిఎంసి జోనల్ అధికారులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆరుగురు బాధితులకు మంజూరైన రూ.3.64లక్షల విలువైన చెక్కులను శుక్రవారం ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సీతమ్మధారలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యంలో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని, బాధితులెవరైనా తన కార్యాలయానికి తగు ఆధారాలతో వచ్చి దరఖాస్తు చేసుకుంటే, వారికి సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి సాయం మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

బయో మెడికల్ ఇంజినీరింగ్‌కు ఉజ్వల భవిష్యత్

మద్రాసు ఐఐటి ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్

ప్రొఫెసర్ పట్నాయక్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : దేశంలోని వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన బయోమెడికల్ ఉత్పత్తుల రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఐఐటి మద్రాసు బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ బిఎస్‌వి.ప్రసాద్ పట్నాయక్ అన్నారు. ముఖ్యంగా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ఈ రంగంలో అవకాశాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బయోమెడికల్ ఇంజనీరింగ్-భారత్‌లో అవకాశాలు సదస్సులో మాట్లాడుతూ, దేశీయంగా వైద్య పరికరాలనుఉత్పత్తి చేయకపోవడంతో విదేశాల నుంచి అధిక వ్యయంతో దిగుమతి చేసుకోవాల్సి వచ్చేదన్నారు. హృద్రోగులకు కృత్రిమ కవాటాలు, ఇతర బయోమెడికల్ ఉత్పత్తులను దిగుమతులను నివారించడానికి మెడ్‌టెక్ జోన్ ద్వారా దేశీయంగా పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. దేశీయ బయోమెడికల్ ఉత్పత్తులతో భవిష్యత్తులో వైద్య ఆరోగ్యరంగంలో అనవసర వ్యయం తగ్గి, రోగులపై ఆర్థిక భారం నివారించవచ్చునన్నారు. మద్రాసు ఐఐటిలోని పరిశోధన బృందం హృద్రోగులకు అవసరమైన బయోమెడికల్ ఉత్పత్తులపై పరిశోధనలు చేస్తోందన్నారు,. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, బయోమెడికల్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా గీతంలో ఎపి మెడ్‌టెక్ జోన్ సహకారంతో బిటెక్‌లో బయోమెడికల్ ఇంజనీరింగ్ కోర్సును గత ఏడాది ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ కామేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలి

సిజిఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగులకు పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి, మిత్ర పక్షాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేసాయి. శుక్రవారం ఉక్కు ఇడి (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉక్కు ఉద్యోగులకు పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ స్కీంలో మార్పులను రద్దు చేసి పాత పద్ధతిలోనే కొన సాగించాలని, మీల్ కార్డు డబ్బులు వేయాలని నినాదాలు చేసారు. అనంతరం సిజిఎం (వర్క్స్) ఇన్చార్జి రంజన్ మహంతి, హెచ్ఆర్. జిఎం ఎన్. భానులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ ఎఐటియుసి అధ్యక్షులు కెఎస్ఎన్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మసేన్ రావు, అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, డొక్కా నర్సింగరావు, డి. దేముడు, చీకటి శ్రీనివాస్, అట్లూరి శివ రామకృష్ణ, ఎస్ .మోహన్‌బాబు, తాండ్ర కనకరాజు, మురళీకృష్ణ, జి.ఆనంద్ మిత్ర పక్షాల నాయకులు గణపతిరెడ్డి, దొమ్మేటి అప్పారావు, ఎం.మహాలక్ష్మి నాయుడు, పల్లా పెంటారావు, యూజ్ మణి పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 'విశ్వ' విద్యార్థుల జయకేతనం

ఐఎంఒలో సత్తా చాటిన విశ్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం: ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విడుదల చేసిన ఫలితాలలో మండలంలో శొంఠ్యాం శ్రీవిశ్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి 22 బంగారు పతకాలు సాధించారు. 33 మంది విద్యార్థులు వచ్చేనెల 9న నిర్వహించే రెండవస్థాయి పరీక్షలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పిల్లలకు అవగాహన మేరకు పూర్తిగా గణిత శాస్త్రంలోనే ప్రశ్నించగా, ఈ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు 33 మంది ఉత్తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రెండోస్థాయికి అర్హత సాధించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22 మందికి .బంగారు పతకాలు పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన సభలో ఐఎంఒలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ , డీన్ శ్రీధర్, విద్యా సంస్థ చైర్మన్ ధర్మరాజు విద్యార్థులను అభినందించారు.

కమ్మేసిన దట్టమైన పొగమంచు

పద్మనాభంలో కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -పద్మనాభం : దట్టమైన పొగమంచు ప్రజలను అల్లాడించింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలు దాటినా భానుడు కానరానంత దట్టంగా పొగమంచు కురవడం, సమీపంలో ఉన్నవారు సైతం కానరానంతగా కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం ఐదారు గంటలకే రైతులు తమ పశువులను పాకల వద్దకు తీసుకెళ్లడం, పొలం పనులకు వెళ్లడం వంటి కార్యకలాపాలకు పొగమంచు అడ్డంకిగా మారింది. తెల్లారినా, చిమ్మచీకటి అలుముకునేంతగా పొగమంచు కురవడం, మంచు దెబ్బకు చెట్టుపైనుంచి ఇంటి ముంగిట్లోంచి నీరు చుక్కలుగా కారవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు దెబ్బకు చలితీవ్రత కూడా పెరగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాససంబంధిత సమస్యలున్న పలువురు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బయటకు వచ్చిన వారికి బట్టలు తడిసిపోవడం, చల్లబడేంతగా పొగమంచు కురవడంతో జనం అవస్థలు పడ్డారు. పొగమంచు వల్ల జీడి, మామిడి పూతలకు, ఇతర పంటలకు నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

వైసిపికి బొడ్డేటి రాజీనామా

బొడ్డేటి కాశీవిశ్వనాథం

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్య దర్శి, సీనియర్ నాయకులు బొడ్డేటి. కాశీవిశ్వనాథం వైసిపి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యా వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

రంగోత్సవం పోటీల్లో విజేతలు వీరే

జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయవాడ జరిగిన రాష్ట్రస్థాయి బాలల రంగోత్సవ పోటీల్లో విజేతల వివరాలను డైట్ ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి శుక్రవారం ప్రకటించారు.
డిజిటల్ కాలేజీ కేటగిరీలో పెద గంట్యాడ మండలం, నడుపూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి ఎస్ చరణ్‌రాజు, రంగోలి కేటగిరీలో స్థానిక కెజిబివి విద్యార్థినులు కె ఉమాదేవి, కె జ్యోత్స్న , స్లోగన్ రైటింగ్‌లో పద్మనాభం కస్తూర్బా విద్యార్థిని కె.సుప్రియ, రోల్ ప్లేలో ఆరిపాక, సబ్బవరం జెడ్‌పి హైస్కూల్స్ విద్యార్థులు ఎ ఉమాదేవి, కె దివ్యధరణి, టి ఇందువర్ధి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలకు విజయవాడలో సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకులు నాగేశ్వరరావు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.వీరిని శుక్రవారం స్థానిక డైట్ లో ప్రిన్సిపాల్ జ్యోతి కుమారి, అధ్యాపకులు అభినందించారు.

ఇపిడిసిఎల్ సిఎండితో జియ్యాని భేటీ

సిఎండి పృథ్వీతేజ్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మాడితో శు క్రవారం నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ భేటీ అయ్యారు. నగరం లోని ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండిని మర్యాద పూర్వ కంగా కలిసిన డిప్యూటీ మేయర్, పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు ఈ సందర్భంగా నగరంలోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా జివిఎంసి 52వ వార్డు తాసీన్ మసీద్ నుంచి జిందాల్ భవన్, సంజీవయ్య నగర్, నేతాజీనగర్, మర్రిపాలెం వుడా లేఅవుట్ వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్లను భూగర్భ పైపులైను ద్వారా ఆధునీకరించాలని సిఎండిని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సహకారంతో నిర్వహించిన సదస్సులో కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ బి సహదేవుడు మాట్లాడుతూ, ఆర్థిక వనరులను ప్రణాళికాబద్ధంగా ఎలా వినియోగించుకోవచ్చు, క్రెడిట్ స్కోర్, కొత్త తరహా బ్యాంకులు, బిజినెస్ కరెస్పాండెంట్లు, యుపిఐని క్రియాత్మకం చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్, ఎటిఎం లావాదేవీలు, మోసపూరిత డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్యాంకు ఖాతా తెరిచేటప్పుడు సమర్పించాల్సిన పత్రాలు, వివిధ రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు సదస్సులో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

205 కిలోల గంజాయి పట్టివేత

కారు, సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి

అక్రమంగా తరలిస్తున్న 205 కిలోల గంజాయిని నర్సీపట్నం రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి కారు, నాలుగు సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పి తుహిన్ సిన్హా ఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు, నర్సీపట్నం రూరల్ సి.ఐ ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం రూరల్ ఎస్.ఐ పి.రాజారావు, గొలుగొండ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎం.రామారావు, నర్సీపట్నం శివారు నెల్లిమెట్ట, సాధుపాకలు వద్ద వాహన తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో టీవీ9 స్టిక్కర్, ఫేక్ కారు నెంబర్తో చింతపల్లి వైపు నుండి నర్సీపట్నం వైపు వస్తున్న వాహనాలను పోలీస్ సిబ్బంది ఆపారు. అందులో ఉన్న నిందితులు అజిత్ తంగరాజన్, అమల్ సురేష్, మర్రి సత్తిబాబు పారిపోతుండగా పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కేసులో సమాచారం సేకరించి గంజాయి పట్టుకున్న సిబ్బందిని నర్సీపట్నం సబ్ డివిజన్ డి.ఎస్.పి. పోతురెడ్డి శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం రూరల్ ఎస్.ఐ.రాజారావు, గొలుగొండ ఎస్.ఐ. రామారావు, సిబ్బందిని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించి ప్రశంసా పత్రం, నగదు రివార్డులను అందించారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవిపి.కాలనీ : విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నెంబర్ - 1 సమీపంలో గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూర్ జిల్లాకు చెందిన రాధాకృష్ణన్, కార్తీక్ సెల్వం, అరుణ్ మోహన్, కార్తి బాలకృష్ణన్లను రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ జిఆర్పి ఇన్స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా చెన్నయ్కు వారంతా గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్పి, పోలీసులు

నేడే గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ రథయాత్ర ప్రారంభిస్తారని చెప్పారు. అమ్మవారిని పురవీధులలో వీధులలో ఊరేగించి ఆదివారం రాత్రి నిమజ్జనం చేస్తామన్నారు. అందరి సహకారంతో సుమారు 36 స్టేజ్ ప్రోగ్రాములు, జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, నేలవేషాలు, కలకత్తా వారి ట్రిక్ లైటింగ్, వీధులలో ప్రత్యేక విద్యుత్ అలంకరణ, రింగ్ రోడ్డు సెంటర్ వద్ద బాణాసంచా విన్యాసాలు, ఉచిత ప్రసాదం పంపిణీ లాంటి అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడి తనాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులు గురిచేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్) అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. బాలాజీ ఎం. రమణ డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్పొరేట్ చైతన్య, నారాయణ కళాశాలలో విద్యార్థులను ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ మధ్య కాలంలోనే విజయవాడ చైతన్య గోశాల క్యాంపస్లో సంక్రాంతి సెలవులకు వెళ్లి తిరిగి కళాశాలకు వచ్చిన విద్యార్థి ఫీజు కడితేనే లోపలికి అనుమతిస్తామని యాజమాన్యం చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అర్ధరాత్రి విద్యార్థి, తండ్రి ఇద్దరు కలిసి కళాశాల బయట నిరసన తెలియజేయడంతో అనుమతించారని తెలిపారు. గురువారం అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని నిలబెట్టడంతో విద్యార్థి మనస్తాపానికి గురయ్యి అక్కడికక్కడే మూడవ అంతస్తు నుండి దూకి మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్పొరేటు విద్యాసంస్థలను విచ్చలవిడి దోపిడీని అదుపుచేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ రెండు ఘటనలు కారకులైన చైతన్య, నారాయణ కళాశాలల క్యాంపస్లను సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థికి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

చిత్రలేఖనం పోటీల్లో ఎబిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పరవాడ : జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొర్సువానిపాలెంలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల ముంబైలోని రంగోత్సవ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఏబీఎస్ స్కూల్ విద్యార్థులు 50 బంగారు పతకాలు, 40 రజిత పతకాలు, 20 కాంస్య పథకాలు సాధించారు. వీరిని శుక్రవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎం.కొండయ్య, ప్రిన్సిపల్ యు.పద్మజ, డైరెక్టర్ యు.దీపక్, చిత్రకళ ఉపాధ్యాయుడు నాయన సురేష్ అభినందించారు.

కొబ్బరి మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల దిబ్బిడి గ్రామం పైడితల్లమ్మ కోణం వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన కొబ్బరి మొక్కలను శుక్రవారం నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పేదరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ముంబై నాగరాజు, సామాపతి మణికంఠ, వీఆర్పి వరాహామూర్తి పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యలమంచిలి నియోజవర్గం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 9 జరుగుతుందని తహశీల్దార్, అదనపు ఓటరు నమోదు అధికారి వరహాలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హోం మంత్రిని కలిసిన ప్రగడ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను శుక్రవారం విశాఖలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తల సేవలు అవసరం

మాజీ మంత్రి, వైసిపి చోడవరం సమన్వయకర్త అమర్నాథ్

మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

ప్రజాశక్తి-చోడవరం

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సేవలు ఎంతో అవసరమని మాజీ మంత్రి, వైసిపి చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ అన్నారు. చోడవరం సమన్వయకర్తగా నాలుగు మండలాల ముఖ్య కార్యకర్తల సమక్షంలో శుక్రవారం అమర్నాథ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామ అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను విస్మరించిన మాట వాస్తవమేనని, భవిష్యత్తులో అటువంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని చెప్పారు. ఏడు నెలల కూటమి పరిపాలన ప్రజలకు అర్థమైందని, ప్రతిచోట గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వానికి బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో పార్టీ బలంగానే ఉందని, కొన్ని నిర్ణయాల వల్ల ఓటమి చెందాల్సి వచ్చిందని చెప్పారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ అందరి సమిష్టి నిర్ణయంతోనే జిల్లాలో పార్టీ మార్పులు చేర్పులు జరిగాయన్నారు. అనంతరం అమర్నాథ్ను నియోజకవర్గ నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. యువజన విభాగం అధ్యక్షులుగా నియామకమైన పుల్లేటి వెంకటేష్ను సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు పాల్గొన్నారు.

అమర్నాథ్కు ఘన స్వాగతం

అనకాపల్లి : వైసిపి చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తరువాత శుక్రవారం చోడవరం వెళ్తున్న నేపథ్యంలో గుండాల వీధి జంక్షన్ వద్ద అనకాపల్లి వైసిపి నియోజకవర్గ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలుకరించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్రాజు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, బుల్లిబాబు, జాజుల రమేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుర్రె రవిచంద్ర యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, ఆఫీస్ స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మావతి, మాజీ సర్పంచ్ చొప్పా రమణ, టిడిపి నాయకులు ఎల్లపు వెంకట్రావు, దేవర కృష్ణ, కుర్ర రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ చట్టి తాతారావు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని ఐద్వా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని, ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అచ్యుతాపురంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి, మండల కార్యదర్శి ఆర్ లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మంగ తాయారు మాట్లాడుతూ రేషన్ డిపోల ద్వారా 16 రకాల నిత్యవసర సరుకులు ధరలు తగ్గించి విక్రయించాలని కోరారు. 2007 ఆహార భద్రతా చట్టం ఉన్నప్పటికీ అది కాగితాలకు తప్ప ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ధరలను అదుపు చేయవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచుతున్నాయి తప్ప తగ్గించడం లేదన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో మంగమ్మ కాసులమ్మ కె సోమ నాయుడు పాల్గొన్నారు.

'మా ఊరిలో వెంకన్న' షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన ప్రముఖ నటులు కోటేశ్వర స్వామి ప్రధాన పాత్రలో నిర్మితమవుతున్న 'మా ఊరి వెంకన్న' చిత్రం షూటింగ్ వైజాగ్ అప్పికొండ బీచ్లో ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన కోరుకొండ గోపికృష్ణ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో పరుచూరి ప్రణతి, మారుతీ రామ్లు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఫైట్ మాస్టర్గా బిల్డర్ అప్పారావు, కెమెరామెన్గా డీజే సంతోష్, ఎడిటర్గా శ్యామ్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్గా ఎంఎల్ రాజు పని చేస్తున్నారు. అమెజాన్ ప్రైమ్, యజ్ఞశ్రీ సంయుక్త సమర్పణలో భక్తి, ఎమోషనల్ జోనర్లో నిర్మితమవుతున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నదని తెలిపారు.

కల్లుగీతవారికి 15 మద్యం దుకాణాలు

లాటరీ ప్రక్రియ చేపట్టిన కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో కల్లు గీత కులాల వారికి లాటరీ ప్రక్రియ ద్వారా 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ వి. సుధీర్, జిల్లా కల్లు గీత ఉప కులాల నాయకులు, శెట్టి బలిజ కులానికి చెందిన పిల్లి రాంబాబు, పాలిక వెంకన్న, యాత కులానికి చెందిన గుత్తుర్తి పాండురంగ, దుంగ అప్పలరాజు సమక్షంలో లాటరీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-2026 సంవత్సరాలకు సంబంధించి మద్యం షాపులకు గీత కులాల ఎంపికకు లాటరీ ద్వారా పారదర్శక కేటాయింపు ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి శెట్టిబలిజ వారికి -9, యాత వారికి-4, గౌడ వారికి-1, గౌడ్ వారికి -1, జిల్లాలో మొత్తంగా 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. దుకాణాలకు (ఆన్లైన్/ ఆఫ్లైన్ /హైబ్రిడ్ మోడ్) ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల నమోదు, సమర్పణ ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీన దరఖాస్తుల పరిశీలన లాటరీకి సంబంధించిన సన్నాహాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని ఎంపికైన దరఖాస్తుదారులకు సమాచారం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

మండలాల వారీగా కేటాయించిన మద్యం దుకాణాలు

శెట్టిబలిజ కులాల వారికి : అనకాపల్లి రూరల్, నక్కపల్లి, నాతవరం, చీడికాడ, వి మాడుగుల, మునగపాక , కశింకోట, రాంబిల్లి, బుచ్చయ్యపేట మండలాలు, యాత కులాల వారికి : రోలుగుంట, పాయకరావుపేట, దేవరాపల్లి, రావికమతం మండలాలు, గౌడ కులాల వారికి మాకవరపాలెం, గౌడ్ కులాల వారికి యలమంచిలి మండలాలు కేటాయించడం జరిగిందన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న పోతల పాత్రునాయుడు

రైవాడ జలాశయాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : భవిష్యత్తులో రైవాడ జలాశయ కమిటీ సభ్యుల పేర్లు చిరస్థాయిగా ఉండేటట్లు జలాశయాన్ని అభివృద్ధి చేస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో శుక్రవారం రైవాడ జలాశయ చైర్మన్‌గా పోతల పాత్రునాయుడు, వైస్ చైర్‌పర్సన్‌గా బొడ్డు ఉమాదేవి, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైవాడ నీటిని రెండు సంవత్సరాల వ్యవధిలో రైతులకు అంకితం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సిహెచ్ సూర్యనారాయణ, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గునూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, పోతల అచ్చమ్మ, పోతల రమణమ్మ, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, కూటమి నాయకులు కొమర బాబురావు, చల్ల నానాజీ, జలాశయ డిఈ సత్యంనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మాజీ ఎంపిపి గండి దేముడుబాబు, గ్రామ సర్పంచ్ బోను దేవుడమ్మ గంగునాయుడు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటల నుండి స్వామి గరిడీలు, చిటికెలు భజనలు, మహిళా కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొర్లి కనకరాజు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మాడుగుల:మండలంలోని గాదిరాయి గ్రామంలో శుక్రవారం రాములవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు గ్రామసర్పంచ్ పెంటకోట జగన్నాధం తెలిపారు. వేకువ జామునుంచి స్వామివారికి గ్రామ పురోహితలు ప్రత్యేక పూజల, అభిషేకాలు అర్చనలు నిర్వహించారు.ఆలయకమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హరిభజన, కోలాటం ఏర్పాటు చేశారు.

చదువుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విద్యార్థులు చదువు పట్ల దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చెప్పారు. ఏపీ రెసిడెన్షియల్ బాలికోనత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, మంచి ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలని సూచించారు.

పూడిమడకలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో శుక్రవారం గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని రమణ పర్యవేకణలో పారిశుధ్య పనులు చేపట్టారు. కడపాలెం, కొండపాలెం, పెద్దూరు, సచివాలయం పరిధిలో, పాత బస్టాండ్, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాలలో చెత్తాచెదారాలను తొలగించారు. గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను జెసిబి ట్రాక్టర్ల సహాయంతో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

జెసిబితో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

బకాయి జీతాల కోసం 27 నుంచి..

కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు

ఎపి వెలుగు విఒఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి

ప్రజాశక్తి-అనకాపల్లి : వెలుగు విఓఏలకు 6 నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, ఉపాధి భద్రత కల్పిస్తూ 3 సంవత్సరాల కాలపరితి సర్క్యూలర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లా కల్టెరేట్ వద్ద నిరాహార దీక్షలు చేస్తున్నట్లు ఏపీ వెలుగు విఓఏ (యానిమేటర్లు) సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి తెలిపారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెలల తరబడి గౌరవ వేతనం అందక విఒఎల కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక మందికి మొబైల్ వర్క్ చేయుటకు రీచార్జ్కు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా డిపార్టుమెంట్, ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల పనులు ఎటువంటి ఆటంకం లేకుండా విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విఓఏలకు 3 సంవత్సరాల కంటే మించి ఉండరాదనే కాలపరిమితి సర్క్యులర్ వల్ల గత 15 ఏళ్ల పైగా ఇదే ఉపాధిపై ఆధారపడిన విఓఏల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి కోరారు. విఒఎల సమస్యలు జనవరి 31వ తేదీలోపు పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 1వ తేదీ నుండి పనులు నిలుపుదల చేసి నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు, కోశాధికారి కె లక్ష్మీప్రసన్న, వై లక్ష్మి, పి వరలక్ష్మి, డి.రాము, టి అప్పారావు, పి దేవి, డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెలుగు విఒఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి

ఎపిఎంకు వినతి

పరవాడ : తమ సమస్యలపై పరవాడ ఏపిఎం రంగారావుకు శుక్రవారం విఒలు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కోశాధికారి జీ వరలక్ష్మి, కే విజయ, పద్మ, సాయి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో నిర్మిర్చిఇన సిసి రోడ్లును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. సోమవరం నుండి ఏనుగుతునికి, సోమవరం నుండి గణపర్తికి రోడ్లు వేయాలని అడిగారని, వాటికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సినీ డైరెక్టర్ భీమరశెట్టి చిన్నికృష్ణ, గ్రామ సర్పంచ్ గొంతిన నాగరత్నం, గొంతిన చిన్నానాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు

అనకాపల్లిని సందర్శించిన రోటరీ అమెరికా బృందం

ప్రజాశక్తి-అనకాపల్లి : రోటరీ క్లబ్ అనకాపల్లి రోటరీ ఫ్రెండ్షిప్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రోటరీ క్లబ్‌కి అమెరికా నుండి ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథ్, బ్రెయిన్ రాలి అనకాపల్లి సందర్శించారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో జీవన విధానాన్ని రోటరీ చేస్తున్న సేవలను పరిశీలించారు. అనకాపల్లిలో ప్రసిద్ధిగాంచిన ప్రదేశాలను చూశారు. నూకంబిక అమ్మవారిని, ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో బెల్లం అమ్మకాలను పరిశీలించి ఇక్కడ జరుగుతున్న లావాదేవీలను అనకాపల్లి వర్తక సంఘ అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణని అడిగి తెలుసుకున్నారు. వర్తక సంఘం ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఎంతో సంతోషించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, రోటరీ ఆర్ఎస్ రాజేశ్వర్ ప్రసాద్, రోటరీ జిల్లా పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ బుద్ధ రమణాజీ, సాన త్రినాథ్, కేలన్ కుమార్, సతీష్, పీజే నాయుడు పాల్గొన్నారు.

కొనసాగిన పశువైద్య శిబిరాలు

కోటవురట్ల మండలంలో రైతులకు మందులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని సోమవరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్న శుక్రవారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకులు డాక్టర్ బి సౌజన్య, పశు వైద్యులు డాక్టర్ చైతన్యమణి, గ్రామ సర్పంచ్ గొంతుని నాగరత్నం, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.శివరాంపురంలో శుక్రవారం జరిగిన ఉచిత పశు వైద్య శిబిరంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు, లేగ దూడలకు ఏలిక పాముల మందులు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరజ అప్పలరాజు, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, దేవర తాతాజీ, సన్యాసినాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురం, బంగారమ్మపాలెం గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. 28 అనారోగ్య పశువులకి వైద్య పరీక్షలు, 43 పశువులకు గర్భకోశ చికిత్సలు, 25 పశువులకు చూడి తనిఖీలు, 105 దూడలకి నట్టల నివారణ మందులు వేసినట్లు అంతకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జి అరుణ తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బైలపూడి రమారావు దాడి లావణ్య కన్నంనాయుడు, మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్యప్రకాష్, పశు వైద్యాధికారులు ఎస్. స్వర్ణలత, బి.సంధ్య పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమలపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 32 పశువులకు వైద్య పరీక్షలు, 18 పశువులకు గర్భకోస చికిత్సలు, 60 పశువులకు, 20 దూడలకు నట్టల నివారణ మందులు, 30 పశులకు పేడ పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వడ్డాది పశు వైద్య అధికారి డాక్టర్ కె వాత్సవి, సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మడుతూరు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ 80 పశువులకు గర్భ కోసం వ్యాధులు, 125 పశువులకు గొర్రెలకు మేకలకు లేక దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాల మిత్రులు ఎస్ ప్రకాశరావు, ఏ అప్పారావు, ఏహెచ్‌ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు సికె పాడు, చలిసింగం గ్రామాల్లో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యులు బాల తేజ, నూకేశ్వరరావులు పశువులు, మేకలు, గొర్రెలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.వ్యాధి నివారణకు టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజుచ గోపాలమిత్ర భీముడి, పారా వెటర్నరీ సిబ్బంది అప్పలనాయుడు, పశు సంవర్ధక సహాయకులు ప్రసాద్, కిరణ్, దేవుడు, అద్దేపల్లి శ్రీను, అయోధ్య పాల్గొన్నారు..

కోటవురట్ల : మండలంలో రాజుపేట, బికేపల్లి గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు, బికేపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్, రాజుపేట గ్రామంలో సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ వైద్య శిబిరాలను ప్రారంభించారు, రాజుపేట గ్రామంలో 18పాడి పశువులకు గర్భ కోశ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. 82 పశువులకు 92 జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. బికేపల్లి గ్రామంలో డాక్టర్ నరేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను రైతులకు వివరించారు. దొడ్ల డైరీ ఆధ్వర్యంలో మినరల్ మిక్సర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరి ప్రియ, ప్రతాప్ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పాకలపాడు గ్రామంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారులు లోకుల రమేష్, శిరీషలు పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. లేగదూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ శిబిరానికి హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ, ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాకలపాడు పాల ఉత్పత్తి సంఘం ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, రుత్తల బంగార్రాజు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల : మండలంలోని ఎం.కోడూరు, జాలంపల్లి గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.పాడి పశువులకు, పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పట్టారు.ఈ కార్యక్రమాన్ని పాడేరు డివిజన్, ఉప సంచాలకులు నరసింహులు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గనుతూరి దార మల్లేశ్వరి, గెంజి రాజేష్ కుమార్, బోరా అప్పలనాయుడు, పల్ల శ్రీను, పశు వైద్యులు మణి లక్ష్మణ్, అరుణా కిరణ్, వి.ఎల్.వో. సత్యం, పశు వైద్య సహాయకులు నాని బాబు, శివ,చంద్ర, కృష్ణారావు పాల్గొన్నారు

రోలుగుంట : ఈ నెల 31వ తేదీ వరకు జరిగే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బుచ్చంపేట పశువైద్యాధికారి బాలమౌనిక కోరారు.. మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 145 పెద్ద పశువులకు, 450 గొర్రెలు, మేకలకు నులిపురుగుల మందులను వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భవాని, రమణ, యశోద, దివ్య, సాయికృష్ణ, శివ, నానాజీ, శ్రీను పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని ఐనాడ పంచాయతీలో రెడ్డిపల్లి పశు వైద్యాధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక సర్పంచి మామిడి శివరామకృష్ణ, ఎంపిటిసి కోరాడ రామేశ్వరరావు, వెటర్నరీ ఎడి డాక్టర్ బి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భకోశవ్యాధులతోపాటు 174 లేగ దూడలు,పాడిపశువులకు, 550 గొర్రెలు మేకలు,400 కోళ్లకు నట్టల నివారణ మందులు అందజేశారు. పాడిరైతులకు లవణ మిశ్రమం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, సుజాత ,సచివాలయం సిబ్బంది తేజ, వేణుగోపాల్ పాల్గొన్నారు

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

నక్కపల్లిలో ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, టీచర్లు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. స్థానిక గురుకులంలో ప్రిన్సిపల్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాలల హక్కుల గురించి వివరించారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని జోగంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. బాలికలకు పలు రకాల ఆటల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.సుబ్బారావు మాట్లాడుతూ, బాలికలు ఉన్నత స్థితికి ఎదిగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలన్నారు. ఏఎల్ పురం హైస్కూలులో బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోచల రమేష్, పీఈటీలు టీవీ.రమణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల :స్థానిక మండల పరిషత్ పాఠశాలలో సూపర్వైజర్ డి నారాయణమ్మ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు జి.సరోజిని, డి.పార్వతి ఎంఎల్ హెచ్పి భవాని, ఆశాలు లక్ష్మి, శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట:బాలికలు అన్ని రంగాలలోనూ బాలురకు ధీటుగా రాణించాలని కొత్తకోట హైస్కూల్ హెచ్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు, కొత్తకోట గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పి ఎస్ ఆర్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, బాలికలంతా చదువుతోపాటు క్రీడా రంగాల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. అధైర్య పడకుండా మనోధైర్యంతో బాలికలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాలలోనూ సమానంగా పోటీ పడుతున్నారని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని బాలికలంతా బాగా చదివి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్కె రత్న కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీడికాడ:బాల్యవివాహాలను నిరోధించాలని ఐసిడి ఎస్ సిడిపిఓ శ్రీదేవి కోరారు. తురువోలు గ్రామంలో బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ గొట్టివాడ సుజాత, అంగన్వాడి సూపర్వైజర్ రమణి, ఏఎన్ఎం పద్మ, ఎంఎల్ హెచ్ పి గోవిందమ్మ పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని పల్లపు సోమవరం గ్రామం శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. బాలికల భద్రత చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతని శ్రీనివాసరావు, సూపర్ వైజర్ వంశీ ప్రియ, అంగన్వాడీ కార్యకర్త నాగ శేషు పాల్గొన్నారు. ఇంకా తేగాడ కెజిబివిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ ప్రభావతి, ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ, సూపర్ వైజర్ జాన్సీ, తాళ్ళ పాలెం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ జి. గ్రేస్ సూపర్ వైజర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అనకాపల్లి : సమాజంలో ఆడపిల్లలకు తగిన గౌరవం ఇవ్వాలని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు అన్నారు. స్థానిక పిహెచ్సి ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మపాలలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఆడపిల్లలను... పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం, ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శంకర్రావు, పిహెచ్సి హెల్త్ ఎడ్యుకేటర్ బి మంగమ్మ, మరియమ్మ, వైద్య సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి గర్ల్స్ హైస్కూలు, స్టేషన్ రోడ్డు హైస్కూలు ప్రాంగణాల్లో బాలికల దినోత్సవాలు నిర్వహించారు. ఎంఇఒ కామాక్షి, హెచ్ఎంలు భవాని, హిమబిందు విద్యార్థినులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలు, గొల్లలపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలతో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. సంతకాల సేకరణ చేపట్టగా, దేవరాపల్లి ఎస్ఐ రాములమ్మ, పలువురు అధికారులు సంతకాలు చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ మంగతాయారు మాట్లాడుతూ బాలికలు బడి మానేయకుండా ఆపాలని, బాల్యవివాహాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు సుశీల, కళ్యాణి, ఆదిలక్ష్మి, రాములమ్మ పాల్గొన్నారు.

వడ్డాది : ఆడపిల్లలు దేశానికి పట్టుకొమ్మలాంటి వాళ్ళని కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది, మంగళాపురం, కుందంపేట, బంగారు మెట్ట, లోపూడి తదితర గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాల ఆద్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వడ్డాది కెజిబివి విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసులు కామాక్షి, ఉమా, అంగన్వాడి కార్యకర్తలు రాధా, అమ్మాజీ, జ్యోతి పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని దేవిపురం శ్రీసహస్రక్షి రాజరాజేశ్వరి దేవి అమ్మవారి పీఠంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమ ప్రభాకర్ మాట్లాడుతూ బాలికలకు విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గురు మాత అన్నపూర్ణమ్మ చిన్నారులను దీవించి బహుమతులను అందజేశారు.

సీతమ్మధారలో..

అనకాపల్లిలో..

సీతమ్మధార : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్.పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంనుంచి సత్యం కూడలి మీదుగా ర్యాలీ సాగింది. ఈసందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ ఏడాది 'ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికల సాధికారత' థీమ్తో బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమన్నారు. బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, భేటీ బచావో భేటీ పడావో నినాదంతో అందరూ పనిచేయాలని, లింగ బేధం తగదన్నారు. బాలికలు విద్యావంతులైతే, వారి కుటుంబం ఉన్నతస్థితికి చేరుకుంటుందని ఆకాంక్షించారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : గీతం ఆసుపత్రి సామాజిక వైద్య విభాగం, గీతం మహిళాసాధికారిక విభాగం, రోటరీ క్లబ్ పెరల్సిటి ఆధ్వర్యంలో పెదవాల్తేరులోని కెడిపిఎమ్. ఉన్నత పాఠశాల, వన్టౌన్లోని క్వీన్ మేరీ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. గీతం మహిళాసాధికార సెల్ చైర్పర్సన్ డాక్టర్ విబి.శ్రీవిద్య పాల్గొని బాలికలకు ఆరోగ్యం, పోషకాహర ప్రాధాన్యతను వివరించారు. కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే శారీరక సమస్యల సందేహాలను నివృత్తి చేశారు. బాలికలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో కెడిపిఎమ్.పాఠశాల హెచ్ఎం సుమతి బాయి, గీతం యుపిహెచ్సి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజు పేట పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జెసిఐ విశాఖ నైట్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో విశాలాక్షినగర్, బివికె హైస్కూల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సేవ్ గర్ల్ చైల్డ్ నినాదంతో విద్యార్థులకు డిబేట్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సైబర్ సెల్ సిఐ టి.కల్యాణి,.జెసిఐ విశాఖ నైట్స్ మహిళా విభాగం డైరెక్టర్ సాయి లక్ష్మీ, జెసిఐ అధ్యక్షుడు సంతోష్, బివికె స్కూలు ప్రిన్సిపాల్ వైవిడి మాధురి, జెసిఐ జోనల్ డైరెక్టర్ అఖిల్య, సభ్యులు కొండల లక్ష్మిపాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సేవా కార్యక్రమాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ యలమర్తి నర్సింగరావు సూచించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కుసుమంచి సమావేశ మందిరంలో శిక్షణ, సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసీడింగ్ ఆఫీసర్, రీజీయన్ చైర్ పర్సన్ కుసుమంచి వెంకటకృష్ణ మాట్లాడుతూ, క్లబ్లో పేదలను గుర్తించి ఆర్థిక రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. క్లబ్ మెంబెర్స్ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలగా జగన్నాధ్, దేవత అరుణ, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాసవి క్లబ్ డైరెక్టర్

బహుమతులు ఇస్తున్న సిఐ

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 8 తేదీన జరిగిన పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో టౌన్ సీఐ జి.గోవిందరావు చేతుల మీదుగా బహుమతులు ప్రధాన చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ, విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడంతో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హెచ్ఎం కే వి మాధవిలత, జె.వి.వి. రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో క్రమశిక్షణ కూడిన విద్యను అభ్యసించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ, జిల్లా ఉపాధ్యక్షులు జి. గౌతమ్, నాయకులు పి.విజయ్, ఎస్.కావేరి, ఓజోలమ్మ, గాయత్రి స్వామి, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఇస్తున్న నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -నాతవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అల్లాడ సురేష్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా చారిటబుల్ ట్రస్ట్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. విద్యార్థులంతా పదిలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని, పదిలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, టీడీపీ యువ నాయకులు పారిశ్రామిక వేత్త వెలగా వెంకట కృష్ణారావు, నాతవరం మండల జనసేన అధ్యక్షులు వెలగల వెంకటరమణ, భాస్కర్, నీటి సంఘం అధ్యక్షులు శివలంక సత్యనారాయణ, చినరాజు, అశోక్, బల్ల అశోక్, పొన్నపు పోతురాజు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై రైతులు ఫిర్యాదు

ప్రజాశక్తి -కొత్తకోట:ప్రభుత్వ భూమిని ఆక్రమించి రైతుల పొలాలకు రహదారి లేకుండా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కన్నంపేట గ్రామ రైతులు శుక్రవారం తహసీల్దార్ కు శుక్రవారం పిర్యాదు చేశారు. ఆ గ్రామంలో సర్వే నెంబర్ 507లో ప్రభుత్వ భూమిని కె.నాగరాజు అనే రైతు ఆక్రమించి సుమారు వంద మంది రైతుల పొలాలకు దారి లేకుండా చేసారని పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని రైతులు ఎం. ఈశ్వరరావు, వి. సత్యారావు తదితరులు పిర్యాదులో పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మహిళలకు స్వయం ఉపాధితో పాటు నైపుణ్యం పెంపొందించడానికి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు అప్ హెూల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంజూరీ ఫిలిప్ తిమోతి అన్నారు. మండలంలోని అడ్డొరిమెట క్యాంప్ ఆఫీస్ వద్ద శుక్రవారం 38మంది శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. మహిళలు సొంతంగా ఆర్థిక అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు. గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డుపై కురుస్తున్న మంచు

కమ్మేసిన మంచు దుప్పటి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా శుక్రవారం దట్టంగా మంచు కురిసింది, ఉదయం నుంచి పది గంటల వరకు ఎడతెరిపి లేకుండా మంచు కొరవడంతో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు, రైతులు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పది గంటల వరకు సూర్యుడు దర్శనం ఇవ్వక పోవడంతో ద్విచక్ర వాహనదారులు లైట్ల వెలుగులతో ప్రయాణం చేసిన పరిస్థితి నెలకొంది.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విజయ్

తీర్థ మహోత్సవ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఐదు రోడ్లు జంక్షన్ వద్ద బాల వినాయక దేవాలయంలో 55వ తీర్థ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ మహోత్సవాలు ఈ నెల 26వ తేదీన ఆదివారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఫిబ్రవరి 1వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాబు, పవన్, చిరు బిజెపి ప్యాకేజీ స్టార్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి ముగ్గురూ బిజెపి ప్యాకేజీ స్టార్‌లని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ ఆరోపించారు. శుక్రవారం ఆశీలుమెట్టలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు, పవన్‌ల వల్ల రాష్ట్రం నాశనమవుతోందన్నారు. వారు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్నారని తెలిపారు.

ప్లాస్టిక్ జాతీయ జెండా వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'ప్లాస్టిక్ జాతీయ జెండాల వాడకాన్ని నిషేధించండి - క్లాత్ జెండాలను వాడండి' అన్న నినాదంతో బాల వికాస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం ఎంవిపి.కాలనీలోని ఎస్‌విపిపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగధీశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పారావు, ఎం.రాణి ప్రియాంక, పి.శైలజ, డాక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి చెట్ల తొలగింపును

అడ్డుకున్న సాగుదారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రాజయ్య పేటలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన డీ పట్టా భూములలో చెట్లు తొలగింపును ఢీ పట్టాదారులు అడ్డుకున్నారు. రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏపీఐఐసీ అధికారుల ఆధ్వర్యంలో సేకరించిన భూములలో పనులు చేపడుతున్నారు. భూములలో కొబ్బరి, జీడి మామిడి మొక్కలను తొలగిస్తున్నారు. శుక్రవారం డి పట్టా భూముల్లో జీడి మొక్కలను జెసిబితో తొలగిస్తుండగా రాజయ్యపేట పంచాయతీ వార్డ్ మెంబర్ మైలపల్లి మహేష్ బాబు, డి పట్టా, సాగుదారులతో కలిసి చెట్లు తొలగింపును అడ్డుకున్నారు. డి పట్టా, సాగు భూములలో కొబ్బరి, జీడి చెట్లకు పరిహారం చెల్లించకుండా చెట్లను ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఎంతో కష్టపడి జీడి మొక్కలను పెంచి, వాటి ఫల సాయంతో జీవనం గడుపుతున్నామన్నారు. పరిశ్రమల పేరుతో సేకరించిన డి పట్టా, సాగు భూములలో చెట్లకు పరిహారం చెల్లించకుండా తొలగించడం దారుణమన్నారు.చెట్లకు పరిహారం చెల్లించిన తర్వాతే, తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి డి పట్టా, సాగుదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.బైరాగిరాజు, ఎం. శివాజీ, ఎం.బాపూజీ, పి.రాజు, జీ.వెంకటేష్, ఎం.నగేష్, మాని కొండమ్మ, అచ్చమ్మ, సి. హెచ్ రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాగుదారులు

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా ఇన్చార్జి ఏపిఎం శివప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు రహదారి భద్రత, నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పలువురు సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

యలమంచిలి : 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక భాష్యం హైస్కూల్లో ఆటో, స్కూలు బస్సు డ్రైవ్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భాష్యం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జోనల్ మేనేజరు ఆంజనేయులు మాట్లాడుతూ 'పిల్లలను ఇంటినుండి పాఠశాలకు, పాఠశాల నుండి నివాసానికి చేర్చడంలో మరింత శ్రద్ధ తీసుకోవలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వి విజయలక్ష్మి కోరారు. శుక్రవారం బుచ్చయ్యపేటలో రహదారి భద్రత వారోత్సవాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ పిల కార్డుల ప్రదర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఎంవీఎస్ లవరాజు, ఏపీఎంఓ టి రాజబాబు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

అరకు ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-అరకులోయ: చలి ఉత్సవ్ పేరుతో నిర్వహించ తలపెట్టిన అరకు ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం అరకులోయలోని హరిత వ్యాలీ రిసార్ట్స్ గోష్టి వేదికపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అరకు ఉత్సవ్ నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడం జరిగిందని, ఆరు, ఏడు రాష్ట్రాల నుండి గిరిజన కళారూపాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ అరకు ఉత్సవము ఈనెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 31వ తేదీన ఐదు కిలోమీటర్ల మారథన్ రన్‌తో ప్రారంభమవుతుందని, అనంతరం వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన వారితో గిరిజన సాంప్రదాయాల మేళవింపుతో కార్నివాల్ ఉంటుందన్నారు. పద్మాపురం గార్డెన్స్‌లో ఫ్లవర్ షో, ప్రధాన వేదిక వద్ద వివిధ స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, అమేజ్మెంట్ ఉంటాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అరకులోయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ ఉత్సవ్ సందర్భంగా అల్లూరి జిల్లాలోని వివిధ సందర్శిత ప్రాంతంలో కూడా లోకల్ ప్రోగ్రాములు నిర్వహిస్తామన్నారు.ఉత్సవ ప్రాంగణంలో సుమారు 30 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు కోటి రూపాయలతో ఈ ఉత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు ఫిబ్రవరి 1న సైకిల్ ప్రొఫెషనల్స్‌తో 20 కిలోమీటర్ల సైక్లింగ్, అరకు బొకే, ఫ్యాషన్ షో, రంగోలి, డ్రాయింగ్ లతో పాటు నృత్య ప్రదర్శనలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.మూడవ రోజు వెస్ట్రన్ డాన్స్, సాంగ్స్ ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు ఫైర్ క్రాకర్స్ ఉంటాయని వివరించారు.

వ్యాధిగ్రస్త శునకాలతో భయం.. భయం..

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో అంతుచిక్కని వ్యాధుల బారిన పడి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నక్కపల్లి, ఉపమాక, వేంపాడు, చందనాడలతో పాటు పలు గ్రామాల్లో వ్యాధులకు గురైన కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. పలుచోట్ల పిచ్చికుక్కలు, వ్యాధులకు గురైన కుక్కలు పాదచారులు పై కాట్లు వేయడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులకు గురైన కుక్కలు కరవడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. సైకిల్, బైక్ లపై వెళ్ళే వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. మేకలు, గొర్రెలు, పశువులు, కోళ్ల పై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంచరిస్తున్న శునకం

మండలంలోని వేంపాడు లో కుక్కల బెడద సమస్యను గ్రామస్తులు ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులు పై వెళ్లే మహిళలు, పాదచారులు, వాహనదారులపై పిచ్చి కుక్కలు, వ్యాధుల బారిన పడిన కుక్కలు దాడులు చేస్తున్నాయని, చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఎంపీటీసీ మధు స్పందిస్తూ, కుక్కల బెడద సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని అన్నారు.

కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణానికి సాగు భూములు దానం చేసిన బాధిత నిర్వాసిత గిరిజనులు ఆందోళన కొనసాగింది. ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఏకలవ్య పాఠశాల ఎదుట ప్రారంభించిన ఆందోళన శుక్రవారం రెండవ రోజు కూడా కొనసాగింది ఈ సందర్భంగా శిబిరం వద్ద వంటావార్పు చేసి బాధిత కుటుంబీకులు భోజనాలు చేసి ఆందోళన చేపట్టారు.